సాక్షి వరంగల్

మంగళవారం | 8 | అక్టోబర్ | 2024



రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్

ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేట రైల్వే కోచెస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

- 10లో▸



ఆపన్నహస్తం అందించరూ..

పేగు క్యాన్సర్‌తో బాధపడుతున్న రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన గారె కమలాకర్ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చెక్ డ్యాంను పరిశీలించిన ఎమ్మెల్యే



వర్ధన్నపేట: ఆకేరు వాగు చెక్ డ్యాం తెగిన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేసిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం పరిశీలించారు. ఎక్కువ వరద వచ్చినా తట్టుకునే విధంగా పనులు పూర్తి చేశారా? అని ఆరా తీశారు. అదే విధంగా ఇంకా అవసరమైతే ఇసుక బస్తాలు నింపి బలంగా ఉండేలా వేయాలని సూచించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఆకేరు వాగు చెక్ డ్యాంల వద్ద తెగిన చోట్ల శాశ్వత మరమ్మతులకు అంచనాలు అధికారులు రూపొందించారని నిధుల మంజూరు కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సు కోసం తాము నిరంతరం పని చేస్తున్నామన్నారు. రైతులు ఎమ్మెల్యే నాగరాజుతో మాట్లాడుతూ.. శాశ్వత ప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా ఈ వేసవి లోపల పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం వల్ల తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు ఎద్దు సత్యనారాయణ, చోటూ, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పంటకు బోనస్ చెల్లించాలి

నర్సంపేట: రైతులు పండించిన ప్రతీ పంటకు బోనస్ చెల్లించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మితేనే బోనస్ ఇస్తామనడం సరైంది కాదని, కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మితే రైతుకు రూ.200నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ధాన్యం ఎక్కడ అమ్మినా.. బోనస్‌ను వారి ఖాతాల్లో వేయాలని, ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లర్ బాక్స్‌ల చోరీ

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామంలో ముద్దరబోయిన రాజుకు చెందిన 100 పిల్లర్ బాక్స్‌లు(భవన నిర్మాణ సామగ్రి) ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. రాజు గ్రామంలో భవన నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని అద్దెకు ఇస్తుంటాడు. ఈక్రమంలో ఎప్పటిలాగే తన షాపు ఎదుట ఖాళీ స్థలంలో 100 పిల్లర్ బాక్స్‌లు ఉంచాడు. వాటిని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం ఎత్తుకెళ్లారు. వీటి విలువ రూ. 50 వేలు ఉంటుందని నిందితులను శిక్షించాలని సోమవారం రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

దుర్గామాతను దర్శించుకున్న సీపీ

కాజీపేట: కాజీపేట శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతను సోమవారం రాత్రి సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ సీపీకి స్వాగతం పలికారు. పూజల అనంతరం దేవతామూర్తుల చిత్రపటం అందించి సీపీ దంపతులను సన్మానించారు.

ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌బీలో ఉన్న జి.సీతారెడ్డి హనుమకొండ ట్రాఫిక్‌కు, షుకూర్ హనుమకొండ ట్రాఫిక్ నుంచి ఇంతేజార్‌గంజ్, జె.వెంకటరత్నం కమిషనరేట్ నుంచి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యారు.

సట్టా, మట్కా నిర్వాహకుడి అరెస్ట్

వరంగల్: వరంగల్ తిలక్‌నగర్ శ్రీనివాసవీధిలోని సట్టా, మట్కా నిర్వహకుడు షేక్ షకీల్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ నేతృత్వంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో సట్టా, మట్కా నిర్వహణపై 'సాక్షి'లో 'గుట్టుగా సట్టా, మట్కా' శీర్షికన ప్రచురితమైన కథనానికి సీపీ అంబర్ కిషోర్ ఝా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి సెల్‌ఫోన్ షాపు పేరుతో సట్టా, మట్కా నిర్వహిస్తున్న షేక్ షకీల్ వద్ద నుంచి రూ.2,910 నగదు, ఒక స్మార్ట్ సెల్ ఫోన్, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దినసరి కూలీలు, ఆటో డ్రైవర్లే టార్గెట్‌గా మోసం చేస్తున్నట్లు చెప్పారు.

పెరగనున్న పేట!

నర్సంపేట మున్సిపాలిటీలో విలీనానికి 9 గ్రామాల ప్రతిపాదన

- క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించిన అధికారులు
- శరవేగంగా పడుతున్న అడుగులు





నర్సంపేట రూరల్: నర్సంపేట మున్సిపాలిటీ పరిధి మరింత విస్తీర్ణం పెంచేందుకు మండలంలోని తొమ్మిది గ్రామాలను విలీనం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయి నుంచి సమాచారాన్ని తయారు చేసి అందించాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఆమేరకు పనులు సైతం సాగుతున్నాయి. ఈ గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములే అధికంగా ఉన్నాయి. ఆవైపు సైతం దృష్టి సారించి పనులు వేగవంతం చేస్తున్నారు. ఈప్రక్రియ ముగిస్తే నర్సంపేట మున్సిపాలిటీలో 14,956 జనాభా, 12,531 మంది ఓటర్లు, 4,236 కుటుంబాలు విలీనం కానున్నాయి.

వ్యవసాయ భూములే అధికం..

విలీనం కానున్న గ్రామాల్లో ఎక్కువశాతం వ్యవసాయ భూములే ఉన్నాయని, మున్సిపాలిటీ పరిధిలో కలిపేందుకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు సైతం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. గతంలో నర్సంపేట మండలంలో ఉన్న సర్వాపురం, ద్వారకపేట గ్రామాలకు 2013లో నర్సంపేట గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేస్తున్న క్రమంలో విలీనం చేశారు. 2018లో అప్పటి ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తున్న క్రమంలో నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామానికి చెందిన కమలాపురం గ్రామాన్ని వేరు చేసి తొలుత ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామన్నారు. నర్సంపేట పట్టణానికి కూత వేటు దూరంలో ఉండడంతో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయడం కంటే నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేస్తే బాగుంటుందని అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచించి కమలాపురం గ్రామాన్ని విలీనం చేశారు. అప్పట్లో మహేశ్వరం గ్రామాన్ని సైతం విలీనం చేసేందుకు ప్రతిపాదనలు చేసినప్పటికీ గ్రామ స్థాయిలో ఎవరూ అంగీకరించకపోవడంతో మహేశ్వరం గ్రామానికి మున్సిపాలిటీలో విలీనం చేయలేకపోయారు. కానీ ఈసారి మహేశ్వరంతో పాటు చుట్టూ ఉన్న 8 గ్రామాలు విలీనం చేసేందుకు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేస్తున్నారని, చివరికి ఎన్ని గ్రామాలు విలీనమవుతాయో.. ఎన్ని గ్రామాల ప్రజలు విలీనానికి ఆమోదం తెలుపుతారో వేచి చూడాలి.

ఏజెన్సీ గ్రామం రాజుపేట విలీనమయ్యేనా?

నర్సంపేట మండలంలోని ఏకైక ఏజెన్సీ గ్రామం రాజుపేట. నర్సంపేటకు కూత వేటు దూరంలో ఈ గ్రామం ఉంది. నర్సంపేట పట్టణ శివారులోని నర్సంపేట-మల్లంపల్లి, నర్సంపేట-పాకాల ప్రధాన రహదారుల్లో ఈ గ్రామం విస్తరించి ఉంటుంది. ఆవాసం పరంగా చిన్న గ్రామమైనప్పటికీ విస్తీర్ణంలో గ్రామం పెద్దగా ఉంటుంది. ఈగ్రామం పూర్తిగా ఐటీడీఏ ఏటూరు నాగారం పరిధిలోనే కొనసాగుతూ వస్తోంది. అయితే నర్సంపేట మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ఏజెన్సీ గ్రామం సాధ్యమవుతుందా? లేదా? అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పీసా, 1/70 చట్టాలు ఎక్కువగా అమలవుతున్న గ్రామం కావడంతో మున్సిపాలిటీకి విలీనంలో ఏమైనా అడ్డంకులుండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విలీనంకానున్న గ్రామాల వివరాలు..

గ్రామాలు	జనాభా	ఓటర్లు	కుటుంబాలు
మహేశ్వరం	3,669	3,001	1,064
రాములునాయక్ తండా	655	496	150
రాజపల్లి	1,401	1,177	311
ముగ్దుంపురం	2,346	2,028	655
నాగుర్లపల్లి	1,251	917	279
పర్శనాయక్‌తండా	517	505	142
మాధన్నపేట	1,786	1,503	431
రాజుపేట	1,403	1,261	748
ముత్తోజిపేట	1,928	1,643	456
మొత్తం	14,956	12,531	4,236

ప్రారంభమైన కసరత్తు

నర్సంపేట మండలంలోని తొమ్మిది గ్రామాలను 2024-25 సంవత్సరంలో మున్సిపాలిటీ పరిధిలో విలీనం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం, రాజపల్లి, రాములునాయక్ తండా, మహేశ్వరం, పర్శనాయక్‌తండా, నాగుర్లపల్లి, మాధన్నపేట, రాజుపేట, ముత్తోజిపేట గ్రామాలను కలిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అయితే మున్సిపాలిటీ విస్తీర్ణం పెంచేందుకోసమే ఈ గ్రామాలను కలుపుతూ ప్రతిపాదనలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించేందుకు చర్యలు చేపడుతున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామంలో ఉన్న పూర్తి సమాచారాన్ని 22 కాలమ్స్‌లో పొందుపర్చి నివేదించాలని ఉన్నతాధికారులు సూచనలు జారీ చేశారు. ఆవైపుగా అడుగులు పడుతున్నాయి.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..



నర్సంపేట మున్సిపాలిటిలో తొమ్మిది గ్రామాలు విలీనం చేసేందుకు ప్రతిపాధనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు కోరారు. ఈమేరకు 9 గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమాచారాన్ని 22 కాలమ్‌లో నివేదికను తయారుచేస్తున్నాం. ఆ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఈ గ్రామాల్లో ఎక్కువగా శాతం వ్యవసాయ భూములే ఉన్నాయి. వ్యవసాయాధికారులతో మాట్లాడి నివేదికను తయారుచేసిన తర్వాతే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఉన్నతాధికారులు తుది నిర్ణయం మేరకే గ్రామాలు విలీనం అవుతాయి.

– శ్రీనివాసరావు, ఎంపీడీఓ, నర్సంపేట

సెంచరీ దాటిన గంజాయి కేసులు

పోలీస్ కమిషనరేట్‌లో 101 కేసుల నమోదు

- పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నా.. ఆగని దందా
- రూ.మూడు కోట్ల విలువైన గంజాయి స్వాధీనం
- పండుగ వేళ ప్రత్యేక నిఘా



హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి అనంతసాగర్ క్రాస్ వద్ద ట్రాక్టర్ డబ్బా కింద దొరికిన గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గంజాయి కేసుల సంఖ్య సెంచరీ దాటింది. పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ నిత్యం ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుబడడం కలకలం రేపుతోంది. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 101 గంజాయి కేసులు నమోదయ్యాయంటే ఈదందా తీవ్రత ఎంత ఉందో ఇట్టే తెలిసిపోతోంది.

యువకులే టార్గెట్

గంజాయి రవాణా, వినియోగంలో యువతను టార్గెట్ చేస్తూ అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. పల్లెలకు సైతం తాకిన ఈ వ్యసనానికి చెక్ పెట్టేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. కాలేజీల్లో, విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ చాపకింద నీరులా గంజాయి రవాణా, వినియోగం విస్తరిస్తోంది.

ప్రత్యేక దృష్టి..

మంచి భవిష్యత్ ఉన్న యువత జీవితాలు ఆగమాగం అవుతుండడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈగంజాయి దందాపై ప్రత్యేక దృష్టి సారించారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దా డులు చేసి పట్టుకుంటున్నారు. ఇంకొన్నిసార్లు ఆయా స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది సహకారంతో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నేరగాళ్లను అరెస్ట్ చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన 101 కేసుల్లో 850 కిలో ల గంజాయిని పట్టుకున్నారు. దీని విలువ మార్కెట్లో సుమారు రూ.3 కోట్లు ఉంటుంది.

మచ్చుకు కొన్ని ఘటనలు..

- ఇటీవల వరంగల్ చింతల్ బ్రిడ్జి వద్ద రూ.2.10 లక్షల విలువైన ఎనిమిది కిలోల 400 గ్రాముల గంజాయిని మహారాష్ట్రలోని ముంబైకి చెందిన వ్యక్తి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- నర్సంపేట మండలంలోని రాజుపేట, కమలాపురం గ్రామాల శివార్లలో 365 జాతీయ రహదారిపై కారులో తరలిస్తుండగా ఆగస్టు 3న 256 కిలోల గంజాయిని నర్సంపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టుకున్నారు. దీని విలువ రూ. 64 లక్షలు ఉంటుంది.
- జూలై 24న శివనగర్ రైల్వే స్టేషన్ థర్డ్ ఫ్లాట్‌ఫామ్ వైపున ఉండే ఆటో స్టాండ్ వద్ద ఒడిషాకు చెందిన వ్యక్తి నుంచి 26 కిలోల గంజాయి లభించింది. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ప్రత్యేక చర్యలు..



గంజాయి రవాణా, సేవించడంపై ఎప్పటి నుంచో ప్రత్యేక దృష్టి సారించాం. చాలా మంది యువత దీనికి అలవాటు అవుతున్నారు. అదే సమయంలో ఈజీ మనీ కోసం గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లుగా మా నిఘాలో తేలింది. పెద్ద బతుకమ్మ, దసరా వేళ వీటి విక్రయాలపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందంతో గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్

మార్కెట్‌కు బతుకమ్మ, దసరా సెలవులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 10నుంచి13వ తేదీ వరకు బతుకమ్మ, దసరా సెలవులున్నందున యార్డుల్లో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, గుమస్తా, దడవాయి, హమాలీ కార్మికులు గమనించాలని కోరారు. తిరిగి 14వ తేదీ సోమవారం మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని కార్యదర్శి తెలిపారు.

'మత్స్య సంఘం' కృషి అభినందనీయం

- ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్



గొర్రెకుంటలో మాట్లాడుతున్న పిట్టల రవీందర్

గీసుకొండ: చేపల వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు, పురుగు మందులు, పౌష్టికాహార పౌడర్ వంటి వాటిని వాణిజ్యపరంగా తయారు చేసే ప్రక్రియలో గొర్రెకుంట మహిళా మత్స్య సహకార సంఘం సాధించిన ఫలితాలు ప్రశంసనీయం అని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం వారు చేపల వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ విజయవంతం ఆయిన సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేపల వ్యర్థాలతో పర్యావరణం కలుషితమవ్వకుండా సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షుడు పి.మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా మత్స్యశాఖ చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి, పీఎం మత్స్య సంపద యోజన ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్, గొర్రెకుంట మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు కందుల కళావతి, అశోక్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ కంబాల కోటి, 16 సొసైటీల ప్రతినిధులు, మత్స్య సహకార సంఘం సభ్యులు స్వప్న, విజయ పాల్గొన్నారు.

క్రషర్ల తనిఖీ



తీగరాజుపల్లిలో క్రషర్లను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

సంగెం: ఆర్డీఓ కృష్ణవేణి నేతృత్వంలో అధికారుల బృందం సంగెం మండలంలోని క్రషర్లు, క్వారీలను సోమవారం తనిఖీ చేశారు. మండలంలోని తీగరాజుపల్లిలోని భాగ్యలక్ష్మి, జేబీసీ స్టోన్ మెటల్స్, జీఎం స్టోన్ క్రషర్, పల్లారుగూడలోని రత్నశీల క్వారీలను అధికారుల బృందం తనిఖీ చేసింది. ఈసందర్భంగా యజమానుల నుంచి అనుమతి పత్రాలు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో అనుమతి తీసుకున్న స్థలంలోనే నిర్వహిస్తున్నారా లేదా? నిబంధనల ప్రకారం జనావాసాలకు, కెనాల్, చెరువులకు ఉండాల్సిన దూరంలోనే ఉన్నాయా లేదా? వంటి అంశాలను రెవెన్యూ, మైనింగ్, ఐబీ, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులు తమ శాఖకు సంబంధించిన నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాలను పరిశీలించి వేర్వేరుగా నివేదికలు తయారు చేసి కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు, నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ కృష్ణవేణి తెలిపారు. కార్యక్రమంలో ఏడీ మైనింగ్ రవిశంకర్, ఐబీ డీఈ గణేశ్, మామునూరు ఏసీపీ తిరుపతి, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీఓ కొమురయ్య, ఎస్సై నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుడి అదృశ్యం



దిలీప్ పరుషరాం

గీసుకొండ: మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పని చేసేందుకు వచ్చిన మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లాకు చెందిన వృద్ధుడు దిలీప్ పరుషరాం అదృశ్యమయ్యాడు. అతడికి పని ఇప్పించడానికి ప్రదీప్ ఠాకూర్ అనే వ్యక్తి టెక్స్‌టైల్ పార్కుకు గత నెల 27న తీసుకుని వచ్చాడు. మరుసటి రోజు టీ తాగుతానని బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాలేదు. అతడి కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ప్రదీప్‌ఠాకూర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఎస్‌ఐ కుమార్ తెలిపారు.

ఎట్టకేలకు ఉద్యానశాఖ విభజన

హనుమకొండ, వరంగల్ జిల్లాలకు ప్రత్యేక శాఖలు

- ఇప్పటివరకు ఒకే జిల్లాగా కొనసాగింపు.. ఒకే జిల్లా అధికారి
- ఎనిమిదేళ్ల తర్వాత శాఖల విభజన
- హనుమకొండకు ఎం.వెంకటేశం, వరంగల్‌కు సంగీతలక్ష్మి
- ప్రస్తుతానికి ఇప్పుడున్న కార్యాలయంలోనే రెండు జిల్లాల కొనసాగింపు



హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖాధికారి ఎం.వెంకటేశం

హన్మకొండ: ఇప్పటివరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలు కలిపి ఒకే ఉద్యాన పట్టుపరిశ్రమ జిల్లా శాఖగా కొనసాగుతూ వచ్చింది. తాజాగా రెండు జిల్లాలకు వేర్వేరు శాఖలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులను సైతం నియమించారు. హనుమకొండ జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారిగా ఎం.వెంకటేశం, ప్రస్తుత అధికారి అయిన సంగీతలక్ష్మిని వరంగల్‌కు పూర్తిస్థాయి అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఎనిమిదేళ్ల తరువాత..

రాష్ట్రంలో 2016లో జిల్లాల పునర్విభజన జరిగింది. పూర్వ వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా విభజించిన ప్రభుత్వం వ్యవసాయ శాఖ, ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖను ఐదు జిల్లాలుగా మాత్రమే చేసింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు కలిపి వ్యవసాయశాఖ, ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖలు ఒకే జిల్లాశాఖగా కొనసాగుతూ వచ్చాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా పిలవడం బాగా లేదని 2021లో వరంగల్, హనుమకొండ జిల్లాలుగా మరోసారి పేరుమారుస్తూ పునర్విభజన చేశారు. ఆ సమయంలో వ్యవసాయశాఖ రెండు జిల్లా శాఖలుగా వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కానీ ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖను రెండు జిల్లాలు కలిపి ఒకే జిల్లాగా కొనసాగిస్తూ వచ్చారు. ఎనిమిదేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ శాఖను సైతం విభజించింది. హనుమకొండ ఉద్యాన పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారిగా ఎం.వెంకటేశంను నియమించడంతో జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ ఏర్పాటైంది. కుమురం భీ ఆసిఫాబాద్ జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్/అసిస్టెంట్ డైరెక్టర్ (టీజీఎంఐపీ)గా కొనసాగుతున్న ఎం.వెంకటేశంను హనుమకొండ జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారిగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎస్.యాస్మిన్‌బాషా ఈనెల 1న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

పోస్టులు భర్తీ అయితేనే..

జిల్లా అధికారిని కేటాయించిన ప్రభుత్వం పూర్తిస్థాయి సిబ్బందిని మాత్రం నియమించలేదు. ప్రస్తుతం రెండు జిల్లాలు కలిపి పనిచేస్తున్న కార్యాలయంలో ఒక సూపరింటెండెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ హనుమకొండ జిల్లా శాఖలో అందుబాటులో ఉన్నారు. కీలకమైన హార్టికల్చర్ ఆఫీసర్ (టెక్నికల్), మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్, అకౌంటెంట్ల పోస్టులు భర్తీ చేస్తేనే పనులు జరుగుతాయి.

పూర్తిస్థాయి వరంగల్ జిల్లా అధికారిగా సంగీతలక్ష్మి..

ఇప్పటివరకు వరంగల్, హనుమకొండ జిల్లాకు కలిపి జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖాధికారిగా కొనసాగుతున్న సంగీతలక్ష్మి పూర్తిస్థాయి వరంగల్ జిల్లా అధికారిగా కొనసాగనున్నారు. ప్రస్తుతం రెండు జిల్లాలకు కలిపి ఉన్న కార్యాలయం హనుమకొండజిల్లా కార్యాలయాల సముదాయంలో కొనసాగుతోంది. హనుమకొండ జిల్లా శాఖ ఏర్పాటుతో వరంగల్ జిల్లా కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేయాలనే సందిగ్ధంలో అధికారులు పడ్డారు. వరంగల్ జిల్లా కార్యాలయం నిర్మించే వరకు ఇక్కడే రెండు జిల్లాల కార్యాలయాలు కొనసాగాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు వేర్వేరు చాంబర్లు సిద్ధం చేస్తున్నారు.

ఉత్సాహంగా.. అథ్లెటిక్స్

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈపోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– వరంగల్ స్పోర్ట్స్

- 10లో▸





దసరాకు నాగ్‌పూర్‌–బీదర్ ప్రత్యేక రైళ్లు

- కాజీపేట మీదుగా నడపనున్న అధికారులు

కాజీపేట రూరల్ : దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా ఈ నెల 11వ తేదీ నుంచి నాగ్‌పూర్, బీదర్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

బీదర్–నాగ్‌పూర్–బీదర్ ప్రత్యేక రైళ్ల వివరాలు

ఈ నెల 11వ తేదీన బీదర్–నాగ్‌పూర్ (07023) ఎక్స్‌ప్రెస్ బీదర్‌లో 18.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12.00 గంటలకు నాగ్‌పూర్ చేరుతుంది. అదేవిధంగా ఈ నెల 13వ తేదీన నాగ్‌పూర్–బీదర్ (07024) ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్‌లో 20.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 11.00 గంటలకు బీదర్ చేరుతుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు జహీరాబాద్, మారపల్లి, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైల్వే బాక్స్ బాయ్‌ల తొలగింపునకు బ్రేక్

- సాక్షి కథనానికి స్పందించిన రైల్వే సంఘ్ నేతలు
- ట్రాలీ బ్యాగుల రద్దుకు అంగీకారం

కాజీపేట రూరల్ : రైల్వే బాక్స్‌బాయ్‌ల తొలగింపునకు బ్రేక్‌తో పాటు విధి నిర్వహణలో రైల్వే గార్డుల (ట్రైన్ మేనేజర్లు)కు డ్యూటీ ట్రాలీ బ్యాగుల పంపిణీ నిలిపివేతకు రైల్వే అధికారులు అంగీకరించినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు తెలిపారు. 'రైల్వే గార్డుల 'సేఫ్టీకి మంగళం' అనే శీర్షికన సెప్టెంబర్ 21వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ కథనాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య దృష్టికి తీసుకెళ్లి వివరించినట్లు సోమవారం కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆపరేటింగ్ బ్రాంచీ సెక్రటరీ మహ్మద్ ముస్తాక్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు రాఘవయ్య రైల్వే బోర్డు అధికారులు, దక్షిణ మధ్య రైల్వే సంబంధిత అధికారులతో మాట్లాడి బాక్స్ బాయ్‌ల తొలగింపు, రైల్వే గార్డులకు పంపిణీ చేసే ట్రాలీ బ్యాగులను రద్దు చేయాలని, అదేవిధంగా కాజీపేట నుంచి విజయవాడకు 35 మంది రైల్వే టీటీల బదిలీలను రద్దు చేయించినట్లు మహ్మద్ ముస్తాక్ హుస్సేన్ తెలిపారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్

గతంలో కాజీపేటలో రైల్వే వ్యాగన్ పీఓహెచ్ వర్క్‌షాప్ ప్రకటన

- తాజాగా అప్‌గ్రేడ్ చేసిన రైల్వే అధికారులు
- ఆర్‌వీఎన్‌ఎల్ కంపెనీకి నిర్మాణ బాధ్యతలు అప్పగింత
- ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీ
- తాజాగా ప్రకటించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శరవేగంగా జరుగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ల నిర్మాణ పనులు



కాజీపేట రూరల్: ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కాజీపేటలో రైల్వే కోచెస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా అధికారికంగా ప్రకటించారు. కాజీపేట మండలం మడికొండలో నిర్మాణమవుతున్న రైల్వే వ్యాగన్ పీఓహెచ్ వర్క్‌షాప్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వే, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్)లకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు కూడా తెలిపారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ కూడా కాజీపేట పీఓహెచ్ షెడ్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న వ్యాగన్ షెడ్‌లో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అండ్ మెయింటెనింగ్, మోడ్రన్ రోలింగ్‌స్టాక్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో జర్మనీకి చెందిన లింకే –హఫ్‌మన్– బుష్ (ఎల్‌హెచ్‌బీ), ఎలక్ట్రిక్ మల్టీపుల్ యూనిట్ కోచ్ (ఈఎంయూ) తయారు కానున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఇటీవల పట్టాలెక్కిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన కోచ్‌లను కూడా కాజీపేటలో తయారు చేసేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు కపుర్తాలా, చెన్నయ్, రాయ్‌బరేలీలో రైల్వేశాఖ కోచ్‌లను ఉత్పత్తి చేస్తున్నారు. ఇటీవల రైల్వేబోర్డు స్థాయిలో జరిగిన సమావేశంలో కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లు చూడాలని బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. రైల్వే సిటీల అనుసంధానాన్ని పరిగణనలోకి తీసుకుని కోచ్‌ల తయారీకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కాజీపేటలో వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలు, సదుపాయాలు, ఏరియా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తీరిన చిరకాలవాంఛ

కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం నాలుగు దశాబ్దాల కల. దీనికోసం అనేక రైల్వే, ప్రజాసంఘాలు, పార్టీలు పోరాటం చేశాయి. యూనిట్ నిర్మాణంతో కాజీపేట ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాంతంలో నిరుద్యోగం కూడా కొంతమేరకు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం కాజీపేట మండలం మడికొండ శివారులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణంలో ఉండగా, కొత్తగా ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల నిర్మాణానికి రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవడంతో జిల్లా ప్రజలు, రైల్వే కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చకచకా రైల్వే వ్యాగన్‌షెడ్ పనులు..

దాదాపు 50 శాతం పనులు పూర్తి ● 2025 జూన్‌లో ప్రారంభానికి సన్నాహాలు

కాజీపేట రూరల్ : కాజీపేట మండలం మెట్టుగుట్ట వెనుక రైల్వే ట్రాక్ సమీపంలో అయోధ్యపురం–మడికొండ శివారు సరిహద్దులో నిర్మిస్తున్న కాజీపేట రైల్వే వ్యాగన్ పిరాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) షెడ్ పనులు చకచకా జరుగుతున్నాయి. 160 ఎకరాల విస్తీర్ణంలో 2023లో జూలై 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌లో వ్యాగన్‌షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వ్యాగన్ పనులు ప్రారంభించి దాదాపు 15 నెలలు కావొస్తుంది. ఇప్పటికే దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయని రైల్వే అధికారులు తెలిపారు. అన్ని విధాలా పూర్తయితే 2025 జూన్‌లో వ్యాగన్ షెడ్‌ను అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం జరుగుతున్న వ్యాగన్ పనుల వివరాలు..

వ్యాగన్ మెయిన్ షెడ్ నిర్మాణం, వివిధ రైల్వే జోన్ల నుంచి గూడ్స్ ద్వారా ఇక్కడికి వచ్చే మెటీరియల్ కోసం స్టోర్ వార్డు నిర్మాణం, వ్యాగన్ షెడ్ నిర్వాహణ కోసం అధికారుల కార్యాలయాలకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణం, కాజీపేట జంక్షన్ నుంచి వ్యాగన్ షెడ్ వరకు ట్రాక్ అనుసంధానం రోడ్ నిర్మాణంతో పాటు వ్యాగన్ షెడ్ ప్రాంగణంలో ఇంకా కావాల్సిన కార్యాలయాలు, వివిధ వ్యాగన్ సెక్షన్ల నిర్మాణం, నిర్వహణ, తదితర కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

శరవేగంగా జరుగుతున్న రైల్వే వ్యాగన్ మెయిన్ షెడ్‌ల నిర్మాణం

వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణమైతే కాజీపేట జంక్షన్‌తో పాటు కాజీపేట సమీప ప్రాంతాలు అభివృద్ధితో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. వ్యాగన్ షెడ్‌కు సంబంధించి చిన్న మెటీరియల్‌కు సంబంధించిన పరిశ్రమలు బయట ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

పట్టుదలతో చదివి.. ఉద్యోగం సాధించి

- అగ్రికల్చర్ ఆఫీసర్‌గా బొల్లెపల్లి శ్రీజ
- చిన్నతనంలోనే తల్లిదండ్రుల మృతి
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదువు
- రైతుల ఆదాయం పెంచడంతో పాటు సహజసిద్ధ పంటలకు ప్రాధాన్యం



ఏఓగా నియామక పత్రాన్ని చూపుతున్న బొల్లెపల్లి శ్రీజ

ఐనవోలు: అభంశుభం తెలియని పన్నెండేళ్ల పసివయసులో తల్లిదండ్రులు ఒకరి తర్వాత మరొకరు చనిపోయారు. తనకు తోడు చెల్లెలు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. తండ్రి తోడబుట్టిన ఇద్దరు అన్నదమ్ములు (బాబాయ్‌లు) ఉన్నప్పటికీ వారికి భారం కాకూడదనుకుంది. స్వయం కృషితో ఎదగాలని పన్నెండేళ్ల పసితనంలోనే స్థిరమైన నిర్ణయం తీసుకుంది. చెల్లెలితో కలిసి స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదువుకుంది. అన్నింటిలోనూ మెరుగైన ప్రతిభ కనబర్చి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. ఐనవోలుకు చెందిన బొల్లేపల్లి లక్ష్మి, వెంకటేశ్‌లకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీజ, ఉషలు. శ్రీజకు 12 సంవత్సరాల వయస్సులోనే తల్లిదండ్రులు ఒకరితరువాత ఒకరు చనిపోయారు. దీంతో ఇద్దరు పిల్లలు ఒంటరయ్యారు. ఒకరికి భారం కాకూడదని శ్రీజ తన చెల్లిని తీసుకుని బొల్లికుంట వద్ద గల డాన్ బోస్కో స్కూల్‌లో నర్సుల సంరక్షణలో పదవ తరగతి వరకు చదువుకుంది. బాల వికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇంటర్ పూర్తి చేసింది. మెడిసిన్ చేయాలని టార్గెట్ పెట్టుకుంది కానీ, ఇంటర్ తర్వాత మనసు మార్చుకుని దేశానికి పట్టుకొమ్మలు రైతులేనని.. వారికి ఏదైనా సేవచేయాలని సంకల్పించుకుంది. దీంతో వెంటనే బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటు పొందడానికి లాంగ్ టర్మ్ చేయాలనుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన గాదె ఇన్నయ్య, పుష్పరాణిలు వారి ఆధ్వర్యంలో నడుస్తున్న మా ఇల్లు ఆశ్రమం ద్వారా ఆర్థిక సహకారం అందించారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటుపొంది డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడగా హనుమకొండలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో ఆరునెలలు కష్టపడి పోటీ పరీక్ష రాసి ఏఓ పోస్టులకుగాను మల్టీ జోన్ 1లో 22వ ర్యాంకు సాధించి ఓవరాల్‌గా 40వ ర్యాంకు సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అగ్రికల్చర్ ఆఫీసర్‌గా నియామక ఉత్తర్వులు అందుకుంది.

రైతుల ఆదాయం పెంచడానికి కృషి

రైతుల ఆదాయాన్ని పెంచడానికి కృషిచేస్తానని ఏఓగా నియాయక ఉత్తర్వులు అందుకున్న శ్రీజ తెలిపారు. సహజ సిద్ధంగా పంటలు పండించే పద్ధతులను ప్రోత్సహిస్తానన్నారు. తనకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన బాలవికాస స్వచ్ఛంద సంస్థ, మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకులు, పెద్దనాన్న, చిన్నాన్న కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనలాగే చెల్లి ఉషా కూడా ప్రస్తుతం మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకుల సహకారంతో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నట్లు శ్రీజ తెలిపింది. ఒంటరి మహిళలు ధైర్యంగా ఇండిపెండెంట్‌గా ఎదగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

'బతుకమ్మ చీరలెక్కడ సీఎం గారు'

- ముఖ్యమంత్రి రేవంత్‌కు మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవి: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఆడపడుచులు ఆనందంగా తొమ్మిది రోజులు ఆడుకునే బతుకమ్మ పండుగకు సీఎం రేవంత్ రెడ్డి చీరలు పంపలేదని, ఆ చీరలెక్కడని? పండుగకు ఇస్తానన్నా రూ.ఐదు వందలు ఏవని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం కురవిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మను సంబురంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పండుగకు ముందే చీరలు అందజేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు పండుగ అయిపోతోందని, ఇప్పటి వరకూ సీఎం రేవంత్‌రెడ్డి చీరలు పంపిణీ చేయలేదని, రూ.ఐదు వందలు అడ్రస్ లేకుండా పోయాయని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారని, ప్రభుత్వం సమీకృత గురుకులాలను గిరిజన జిల్లాకు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలు, గిరిజన మంత్రి సీతక్క ఉన్నప్పటికీ జిల్లాకు గురుకులాలు మంజూరు చేయించకపోవడం వారికి ఈ ప్రాంత అభివృద్ధిపై ఉన్న నిబద్ధత అర్థమవుతోందన్నారు. మంత్రి కొండా సురేఖ చౌకబారు మాటలు ఆమె సంస్కారాన్ని చూపుతున్నాయని వివరించారు. సమావేశంలో నాయకులు ఐలి నరహరి, మన్యూ ప్యాట్నీ, బోడ శ్రీను, నూతక్కి నర్సింహరావు, గుండెబోయిన సూరయ్య, అర్జున్ చౌహాన్, కల్లెపు శ్రీనివాస్, భద్రునాయక్, నెహ్రూనాయక్, కిషన్ నాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

మాటల్లో దింపి మాయ చేశారు..

- 35 తులాల బంగారం కొట్టేశారు
- బస్సులో ప్రయాణిస్తూ చేతి వాటం ప్రదర్శించిన ఇద్దరు మహిళలు
- రంగంలోకి పోలీసు బృందాలు

జనగామ : సస్పెన్స్ సినిమాను తలపించే చోరీ.. ఆర్టీసీ బస్సులో మహిళను మాటల్లోకి దింపి చేతి బ్యాగులో ఉన్న లక్షల విలువైన బంగారు ఆభరణాల ప్యాకెట్‌ను మాయం చేశారు. ఈ ఘటన జనగామలో వెలుగు చూసింది. సీఐ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామ పట్టణం గణేశ్ స్ట్రీట్‌కు చెందిన చౌల్లేటి నివేదిత హనుమకొండ న్యూశాయంపేటలోని సోదరి ఇంటికి వెళ్లింది. ఈ నెల 5వ తేదీన సాయంత్రం జనగామకు వచ్చేందుకు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఉప్పల్‌కు వెళ్లే బస్సు ఎక్కగా.. జనగామలో స్టాప్ లేదని కండక్టర్ చెప్పడంతో సుబేదారి వద్ద దిగింది. అనంతరం ఉప్పల్ వయా జనగామకు వచ్చే మరో బస్సు ఎక్కింది. ఈ క్రమంలో కాజీపేటలో ఇద్దరు మహిళలు అదే బస్సు ఎక్కగా... అందులో ఓ లేడీ పక్కనే ఉన్న సీటులో కూర్చోగా.. మరో మహిళ నిలబడి ఉంది. నివేదిత తన బ్యాగును కాళ్లపై పెట్టుకోగా, సదరు అనుమానిత మహిళ దానిని బలవంతంగా తీసుకుని పక్కన పెట్టుకుంది. బ్యాగులో 35 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో బాధిత మహిళ నివేదిత తన బ్యాగు తీసుకుని జనగామ బస్టాండ్‌లో బస్సు దిగి ఇంటికెళ్లింది. కొద్ది సమయం తర్వాత బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉన్న ప్యాకెట్ కనిపించలేదు. దీంతో లబోదిమంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సోమవారం చేసింది. దీంతో సీసీ ఫుటేజీ పరిశీలనతో పాటు హైదరాబాద్, అనుమానిత ప్రాంతాలపై పోలీసులు నిఘా ఉంచారు.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు

వరంగల్ లీగల్ : హనుమకొండలోని గణేశ్‌నగర్‌లో ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలకు ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ సెషన్స్ కోర్టు జడ్జి క్షేమ దేశ్‌పాండే సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. 2014 సెప్టెంబర్‌లో హనుమకొండ గణేశ్‌నగర్‌లో సమ్మయ్య(లెక్చరర్) అనే వ్యక్తి ఇంట్లోకి ఆరుగురు వ్యక్తులు చొరబడి భయభ్రాంతులకు గురిచేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు హనుమకొండ పీఎస్‌లో కేసు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్ కిరణ్ కేసు దర్యాప్తు చేసి గోదావరిఖనికి చెందిన నిందితులు ఎస్‌కే అలీ హైదర్, రాదండీ శంకర్, మునీపెద్ది మధుకర్‌ను అరెస్టు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురు నిందితులు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులను కానిస్టేబుల్ సురేశ్, సుభాశ్ కోర్టులో హాజరుపర్చారు.

ఎల్లలు దాటినా మరవని సంస్కృతి..

అమెరికాలో బతుకమ్మ సంబురాల్లో జనగామకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు



జనగామ: సప్త సముద్రాలు దాటినా మన సంస్కృతిని మరచి పోలేదు. ఉద్యోగ రీత్యా పాశ్చాత్య దేశాలకు వెళ్లి స్థిరపడినా.. తెలుగు పండుగలను ఘనంగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నా రు జనగామకు చెందిన ఎన్‌ఆర్‌ఐ కుటుంబాలు. రేణుకుంట కల్ప నాసుమన్ తోపాటు వందలాది కు టుంబాలు అమెరికా కొలంబస్ ఇండియానాలో బతుకమ్మను ఘ నంగా జరుపుకుంటున్నారు. తీరొ క్క పూలతో బతుకమ్మను పేర్చిన అనంతరం ఆడుతూ తెలుగు సంస్కృతిని చాటుతున్నారు.



బతుకమ్మ ఉత్సవాల్లో ఎన్‌ఆర్‌ఐ మహిళలు

జేఎన్‌ఎస్‌లో క్రీడా పండుగ..



400 మీటర్ల పోటీలో పరుగెత్తుతున్న బాలికలు



800 మీటర్ల పోటీలో పరుగెత్తుతున్న బాలురు

ఉత్సాహంగా ప్రారంభమైన అథ్లెటిక్స్ పోటీలు

- రెండు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న సుమారు వెయ్యి మంది క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం 10వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ పోటీలకు సాట్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కాగా, ఇటీవల చెన్నైలో జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల పరుగులో వెండి పతకం సాధించిన వినోద్‌కుమార్, 3కే మీటర్ల పరుగులో వెండి పతకం సాధించిన మోహిత్‌చౌదరికి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.15వేల నగదు ప్రోత్సాహం అందజేశారు.



జావలిన్‌త్రోలో పాల్గొన్న క్రీడాకారిణి

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

LOSS OF PASSPORT

■ I, MODEM SRUJAN KUMAR, S/o: MODEM RAVI, H.No. 24-4-270, Darga Kazipet, Kazipet Mandal, Hanumakonda District, Telangana State, India. I have lost the original passport bearing no. U9801283 while I was traveling by bike from the Collector Office to Nakkalagutta, Hanamkonda, Hanumakonda Dist. on 30-09-2024 at 11:30 a.m. If anyone is found, please inform me at the above address and contact number 9010516923. [W-1239788]

WANTED

■ Wanted Experience Staff Nurse for Hospital in Hanamkonda. Cell: 7680071974. [W-1237316]

■ ప్రముఖ ISO సర్టిఫికేట్ గల కంపెనీలో పని చేయుటకు మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీ/పు) కావలెను. ప్రతి నెల లక్ష ఇన్‌కం. VRS రిటైర్మెంట్ వారికి కూడా ప్రాధాన్యత. సంప్ర॥ 9866137009 [W-1237320]

■ పని మనిషి కావలెను: హన్మకొండలో బెడ్ రెస్ట్ తీసుకుంటున్న స్త్రీకి మా ఇంట్లోనే ఉంటూ తనకి సేవ చేయుటకు స్త్రీ కావలెను. జీతం, భోజనం, వసతి కలదు. సెల్: 7569268606. [W-1237256]

■ AD GROUP of Companies Wanted Sales Executive (Male), AutoCad Designer (Female), Social Media & Digital Marketing (Female) Min 1 Year Exp. Cell: 9550487037. [W-1264999]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైద్యం వికటించి మహిళ మృతి

- మృతురాలి కుమారుడి ఆరోపణ
- ఆర్‌ఎంపీపై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు



రత్నకుమారి (ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో మండలంలోని ఊరట్టం కాలనీ(కొత్తూరు) గ్రామానికి చెందిన అసిస్టెంట్ బ్రాంచీ పోస్టు మాస్టర్ కుర్రి రత్నకుమారి(45) ఆదివారం రాత్రి మృతి చెందిందని మృతురాలి కుమారుడు భాస్కర్ ఆరోపించారు. భాస్కర్ కథనం ప్రకారం.. రత్నకుమారికి ఇటీవల జ్వరం రావడంతో ఆదివారం నార్లాపూర్‌లోని ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్ వద్దకు తీసుకెళ్లారు. గ్లూకోజ్ ఎక్కించి ఇంజెక్షన్లు వేయడంతో ఆరోగ్య పరిస్థితి విషమించగా ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో రత్నకుమారి మృతి చెందింది. ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్ వైద్యం వికటించడంతోనే తన తల్లి రత్నకుమారి మృతి చెందిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ సోమవారం డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్యకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్‌ను వివరణగా రత్నకుమారికి పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ వచ్చిందని, రక్తకణాలు తగ్గిపోయాయని చెప్పి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పానన్నారు. అయితే ఆమె కుమారుడు డబ్బులు లేవు ఇక్కడే వైద్యం చేయమని కోరగా గ్లూకోజ్ పెట్టానన్నారు. చలిరావడంతో విరుగుడు ఇంజెక్షన్ వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించానని తెలిపారు. వైద్యం వికటించి మృతి చెందిందని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి



వర్షిత(ఫైల్)

ములుగు రూరల్: విషజ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పత్తిపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాటోత్ కవిత, జయపాల్ దంపతుల కుమార్తె వర్షిత(08) నాలుగో తరగతి చదువుతుంది. వారం రోజుల నుంచి వర్షితకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ములుగులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందించారు. మూడు రోజుల పాటు వైద్యం పొందింది. చిన్నారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించాక సదరు ఆస్పత్రి వైద్యుడు హనుమకొండకు తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న క్రమంలో ఆది వారం రాత్రి మృతి చెందింది. చిన్నారి వైద్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరారు.

పోలీసుల పేరిట బెదిరింపులు..

- యువకులను చితకబాది డబ్బులు వసూలు
- ఇద్దరి యువకుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పార్థసారథి



మాట్లాడుతున్న ఏసీపీ, పక్కన సీఐ దామోదర్ రెడ్డి

జనగామ : క్రైం బ్రాంచ్ పోలీసుల పేరు చెప్పి.. శుభకార్యానికి వెళ్తున్న యువకులను ఇద్దరు యువకులు అడ్డగించి వారి వద్ద నుంచి డబ్బులు లాక్కెల్లారని ఏసీపీ పార్థసారథి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన దేవరుప్పుల మండలం గొల్లపల్లికి చెందిన బట్ట నితిన్, తన స్నేహితులు జనగామ మండలం నిడిగొండలో జరిగిన ఫంక్షన్‌కు హాజరై అర్ధరాత్రి 12 గంటలకు తిరిగి బయలుదేరారు. ఇదే సమయంలో యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన కామని వినయ్, యామంకి మధు క్రైం బ్రాంచ్ పోలీసుల పేరు చెబుతూ ఫంక్షన్‌కు వచ్చి వెళ్తున్న యువకులను చితకబాదారు. వారి నుంచి రూ.ఐదు వందల నగదు, ఫోన్ నుంచి మరో ఎనిమిది వందలు తీసుకుని పరారయ్యారు. బాధితుడు నితిన్ ఫిర్యాదు మేరకు సదరు యువకులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు, ఒక బైక్, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. పట్టణ, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్సై రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 'మొక్క ముడుపు'నకు తరలిరావాలి


ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ క్రాస్ వద్ద పూజారుల సమక్షంలో నేడు(మంగళవారం నిర్వహించనున్న మొక్క ముడుపు పండుగకు మేడారం జీపీ పరిధిలోని గ్రామస్తులు తరలిరావాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు కోరారు. ఈ మేరకు సోమవారం మేడారం వనదేవతల ప్రధాన ద్వారం ఎదుట పండుగకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'వనదేవతలకు మాటిద్దాం–మొక్క ముడుపు చెల్లిద్దాం' అనే నినాదంతో వినూత్న కార్యక్రమానికి మేడారం పూజారుల సమక్షంలో మేడారం ఆది వాసీ యువకులు శ్రీకారం చుట్టారన్నారు. అడవి పునరుద్ధరణ, ప్లాస్టిక్ వినియోగ నివారణకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ప్లాంటేషన్ ఫెస్టివల్ నిర్వాహకులు అనిల్‌కుమార్, సుధీర్‌కుమార్, రమేశ్, రమేశ్, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన భోజారావు, కుర్సం రవికుమార్ పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అందించరూ!

- పేగు క్యాన్సర్ వ్యాధితో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి
- చికిత్స కోసం స్థోమతకు మించి అప్పు చేసిన కుటుంబీకులు
- ఇంకా ఖర్చు అవుతుందని చెప్పిన వైద్యులు
- ఆర్థిక సాయం కోసం నిరుపేద కుటుంబం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న కమలాకర్



రాయపర్తి: అసలే నిరుపేద కుటుంబం. అందులో మాయదారి రోగం వెంటాడుతోంది. స్థోమతకు మించి అప్పులు చేసి ఖర్చు చేసినా ఆ వ్యక్తి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన గారె కమలాకర్ 2008లో హైదరాబాద్‌కు చెందిన మేరీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హైదరాబాద్‌లోనే సెల్‌టవర్లలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కమలాకర్ ఐదు సంవత్సరాల క్రితం పేగు క్యాన్సర్ వ్యాధికి గురయ్యాడు. చికిత్స పొందగా కొంత మేరకు తగ్గుతూ వచ్చింది. ఇటీవల వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం చికిత్సకు రోజుకు రూ.50 వేల ఖర్చవుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో తాహతుకు మించి రూ.15 లక్షల వరకు అప్పులు చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లగవ్వ లేదు. దీంతో దాతల సాయం కోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. మనసున్న మహారాజులు స్పందించి ఆపన్న హస్తం అందించాలని వేడుకుంటున్నారు. దాతలు **8985129133** నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.